
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
ఆదివారం 3 మార్చి 2024



స్థిరంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో పగటి పూట ఎండ ప్రభావం చూపుతున్నది. జి.మాడుగులలో 10.7, పాడేరులో 12.2, జీకేవీధి, చింతపల్లిలో 12.4, పెదబయలులో 13.2, అరకులోయ, ముంచంగిపుట్టు, హుకుంపేటలో 13.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి. పాడేరు మినహా పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు పొగ మంచు కురిసినప్పటికీ మధ్యాహ్నం మాత్రం ఎండ ప్రభావం కొనసాగింది.

5, 7 తేదీల్లో సీఎం రాక

5న విశాఖలో పారిశ్రామిక సదస్సు

- 7న అనకాపల్లిలో 'చేయూత' కార్యక్రమం



విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల ఐదు, ఏడు తేదీల్లో విశాఖ రానున్నారు. ఈనెల ఐదో తేదీన 'విజన్ వైజాగ్' పేరుతో భీమిలి బీచ్‌రోడ్డులోని రాడిసన్ హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో నిర్వహించనున్న సదస్సులో ఆయన పాల్గొంటారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన శాఖ పీఎం పాలెంలోని వి.కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న కార్యక్రమానికి సీఎం హాజరవుతారు. అలాగే ఈనెల ఏడో తేదీన మరోమారు సీఎం విశాఖ రానున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకుని, విమానాశ్రయం నుంచి నేరుగా అనకాపల్లి వెళతారు. 'చేయూత' పథకం నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. ఈనెల ఐదో తేదీన విశాఖలో సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్ అయ్యన్నార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంతవర్మ, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు శనివారం పరిశీలించారు.

నేడు పల్స్ పోలియో

- జిల్లాలో 1,23,673 మంది చిన్నారులకు పోలియో చుక్కలు లక్ష్యం

పాడేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 22 మండలాల్లో 352 హెల్త్ సబ్ సెంటర్ల పరిధిలోని ఆరేళ్లలోపు ఉన్న ఒక లక్షా 23 వేల 673 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేశామన్నారు. అందుకు గాను 2,232 పల్స్ పోలియో కేంద్రాలు, 63 మొబైల్ బూత్‌లు, 54 ట్రాన్సిట్ బూత్‌లను సిద్ధం చేశామన్నారు. ఇందుకు 8,928 మంది సిబ్బంది పని చేస్తారని, వారిని 264 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారన్నారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, యువత, స్వచ్ఛంద సేవకులు సహకరించాలని డీఎంహెచ్‌వో జమాల్ బాషా కోరారు.

ఘాట్ రోడ్డులో రక్షణ కరువు



ఘాట్‌లో ప్రమాదకరమైన మలుపు వద్ద శిథిలమైన రక్షణ గోడలు

ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని రక్షణ గోడలు

- గతేడాది బస్సు ప్రమాదం నేపథ్యంలో మొక్కుబడిగా పనులు
- కార్యాచరణకు నోచుకోని రూ.8.5 కోట్ల ప్రతిపాదన
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే స్థానిక ఘాట్ మార్గంలో రక్షణ గోడలు శిథిలమయ్యాయి. దీని వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాల్సిన వైసీపీ ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

స్థానిక ఘాట్ మార్గంలోని రక్షణ గోడలు చాలా కాలంగా కనీసం మరమ్మతులకు సైతం నోచుకోలేదు. గతేడాది ఆగస్టు 20న ఘాట్‌లో ఆర్‌టీసీ బస్సు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందగా, 31 మంది గాయపడిన నేపథ్యంలో అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్ రక్షణ గోడలకు మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు.





ఘాట్‌లో శిథిలమైన తాజాగా మరమ్మతులు చేసిన రక్షణ గోడ

దీంతో రెండు, మూడు మలుపుల్లో మాత్రమే రక్షణ గోడలకు మరమ్మతులు చేసి అధికారులు మిన్నకున్నారు. చేసిన ఆ పనులు సైతం నాణ్యత లేకపోవడంతో ప్రస్తుతం అవన్నీ శిథిలమైపోయాయి. కాగా పాడేరు జిల్లా కేంద్రం కావడంతో ఘాట్ మార్గంలో రాకపోకలు పెరిగాయి. ఈ క్రమంలో స్థానిక ఘాట్ రోడ్డులో రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాడేరు నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు సాగించాలన్నా, ఆయా ప్రాంతాల నుంచి పాడేరుతో పాటు ఒడిశా రాష్ట్రానికి వెళ్లాలన్నా ఘాట్ ప్రయాణం తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ఘాట్ మార్గంలో రక్షణపై పాలకులు దృష్టి సారించకపోవడం ఘోరమని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా ఘాట్‌లోని వ్యూపాయింట్‌కు సమీపంలో, రాజాపురం సమీపంలో, ఏసుప్రభు బొమ్మ మలుపులకు అటూ, ఇటూ, వంట్లమామిడి నుంచి గరికిబంద వరకు ఉన్న మలుపుల్లో రక్షణ గోడలు శిథిలమైపోయాయి. పొరపాటున వాహనాలు అదుపు తప్పితే లోయలోకి దూసుకుపోవాల్సిందే. గతంలో నిర్మించిన రక్షణ గోడలు శిథిలం కాగా, చాలా ఏళ్లుగా కొత్త రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ఘాట్ ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

కార్యాచరణకు నోచుకోని ప్రతిపాదన

స్థానిక ఘాట్ మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేయాలని చాలా కాలంగా రోడ్లు, భవనాల శాఖాధికారులు ప్రతిపాదిస్తున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. 2022లో అప్పటి ఐటీడీఏ పీవో రోణంకి గోపాలక్రిష్ణ ఘాట్ మార్గంలో అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులను కోరారు. అందుకు గాను సుమారుగా రూ.8 కోట్ల 50 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. ఆయా నిధులు మంజూరైతే ఘాట్‌లోని ప్రమాదకరంగా ఉన్న మలుపులను సరి చేయడంతోపాటు, వాహనాలు అదుపు తప్పి లోయల్లోకి బోల్తా కొట్టకుండా పటిష్ఠమైన ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేయాలని భావించారు. కానీ ఆ ప్రతిపాదనకు రెండేళ్లయినా రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం తెలపలేదు. దీంతో అభివృద్ధి అనేది ఘాట్ రోడ్డుకు మరింత దూరమైంది.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించండి

రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

పాడేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ విజయసునీత సూచించారు. తన కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,021 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వాటిలో 21 పోలింగ్ కేంద్రాలకు మాత్రం పలు కారణాలతో పేర్లను మార్చుతున్నామని, కానీ ప్రాంతాలను మాత్రం మార్చడం లేదన్నారు. మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు మూడు పంపిణీ, స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అరకులోయ నియోజకవర్గానికి అరకులోయలోని తహసీల్దార్ కార్యాలయం, పాడేరు నియోజకవర్గానికి స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో, రంపచోడవరంలో అక్కడ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాడేరులోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో మొత్తం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. జనవరి 22న ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలో 7 లక్షల 61 వేల 255 మంది ఓటర్లున్నారని, ప్రస్తుతం సవరణ కొనసాగుతుండడంతో మరో ఆరు వేల మంది ఓటర్లు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం జాబితాలో ఓటరు పేరును తొలగించాలంటే ఎన్నికల కమిషన్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా రాజకీయ ప్రతినిధులకు ఎన్నికలపై ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనలపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సీదరి మంగ్లన్నదొర, కె.బాలకృష్ణ, గంగపూజారి శివకుమార్, ఎల్.సుందరరావు, కె.ఆనందరావు, ఎం.పండన్న, తదితరులు పాల్గొన్నారు.

7న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, మార్చి 2: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 7వ తేదీన నిర్వహించనున్నట్టు సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరం వీసీ హాల్‌లో ఒకటి నుంచి ఏడో స్థాయి సంఘ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘ సమావేశాలు, 11 గంటలకు 3, 4 స్థాయీ సంఘ సమావేశాలు, 12 గంటలకు 1, 6, 7 స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తామని, జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సీలేరు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుకు అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలు

- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాజెక్టు నిర్మాణం
- అనుమతులు రాగానే పనులు ప్రారంభించనున్న జెన్‌కో అధికారులు
- డీఎఫ్‌వో సూర్యనారాయణ



మాట్లాడుతున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ

చింతపల్లి, మార్చి 2: సీలేరు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు నిర్మాణానికి అటవీశాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించామని డివిజనల్ ఫారెస్టు అధికారి(డీఎఫ్‌వో) చిట్టపులి సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విద్యుదుత్పత్తి చేసేందుకు ప్రభుత్వం సీలేరుకి పంప్డ్ స్టోరేజి(హైడ్రో పవర్ ప్రాజెక్టు) మంజూరు చేసిందన్నారు. ఈ పంప్డ్ స్టోరేజి సీలేరు రేంజ్ పరిధి రిజర్వుడ్ ఫారెస్టు భూమిలో నిర్మించనున్నారన్నారు. పంప్డ్ స్టోరేజి నిర్మాణానికి సీలేరు రేంజ్ పరిధిలో 215 హెక్టార్ల భూమి అవసరమని జెన్‌కో అధికారులు కోరారని చెప్పారు. ఈ భూమికి ప్రత్యామ్నాయంగా సత్యసాయి జిల్లాలో భూమిని కేటాయించేందుకు ఒప్పందాలు జరిగాయన్నారు. పంప్డ్ స్టోరేజి నిర్మాణానికి అవసరమైన రిజర్వు ఫారెస్టు భూమిలో ఒకే ఒక గిరిజన గ్రామం ఉన్నదన్నారు. మరో గిరిజన గ్రామం రెవెన్యూ భూమిలో ఉందన్నారు. పంప్డ్ స్టోరేజి నిర్మాణానికి అవసరమైన అటవీ భూమిని ఇటీవల సీసీఎఫ్ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారని చెప్పారు. అటవీ భూమిని క్షుణ్ణంగా పరిశీలించి పంప్డ్ స్టోరేజి నిర్మాణానికి అవసరమైన అటవీశాఖ అనుమతులు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. అటవీశాఖ అనుమతులు సాధ్యమైనంత వేగంగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంప్డ్ స్టోరేజి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్నారన్నారు. అటవీశాఖ అనుమతులు మంజూరుకాగానే జెన్‌కో అధికారులు పనులు ప్రారంభిస్తారని ఆయన చెప్పారు.

అలల తాకిడికి ఫ్లోటింగ్ బ్రిడ్జి తలకిందులు

టి జంక్షన్ వ్యూ పాయింట్ మునిగిపోయిన దృశ్యం



మళ్లీ ఊడిన 'టి జంక్షన్ వ్యూ పాయింట్'

- అక్కడే కొనసాగించాలని అధికారుల మొండి పట్టుదల!
- పర్యాటకులకు ఏమైనా అయితే బాధ్యత ఎవరిది?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆర్‌కే బీచ్‌లో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జిపై అధికారులు మొండి పట్టుదలకు పోతున్నారు. బలమైన కెరటాల ధాటికి ఆ వంతెనకు అమర్చిన 'టి జంక్షన్ వ్యూ పాయింట్' ప్రతి రోజూ తలకిందులు అవుతోంది. బ్రిడ్జి నుంచి విడిపోయి దూరంగా వెళ్లిపోతోంది.



బ్రిడ్జి నుంచి విడివడి దూరంగా ఉన్న టీ జంక్షన్ వ్యూపాయింట్

ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఏ ముహూర్తాన ప్రారంభించారో గానీ దానిపైకి ఎవరినైనా అనుమతించాలంటేనే ఈతగాళ్లే భయపడుతున్నారు. ముంబై నుంచి వచ్చిన నిపుణుల బృందం కూడా సరైన సూచనలు చేయలేకపోయింది. శనివారం ఉదయం మరోసారి అలల వంతెన తిరగబడడంతో ఆ ప్రాంతం అంతా కల్లోలంగా మారిపోయింది. అలలు వచ్చినప్పుడు 'టి జంక్షన్ వ్యూ పాయింట్' బాగా పైకి ఎగిసిపడుతోంది. ఆ సమయంలో పొరపాటున అక్కడ ఎవరైనా ఉంటే ప్రమాదమే. ఆర్‌కే బీచ్‌లో ఎక్కడికక్కడే పదునైన బండరాళ్లు ఉన్నాయి. అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంలో ఈ ప్రాజెక్టును పెట్టి, దానిని ఎలాగోలా నడపాలని చూడడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. తప్పును సవరించుకుని సురక్షితమైన మరోచోట పెట్టుకోవచ్చు. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ఇంకొక దగ్గరకు మార్చాలంటే అనుమతులు అవసరమవుతాయని, దానికి జాప్యం జరుగుతుందని ఆలోచన చేస్తున్నారు.

ఆర్కే బీచ్ వద్ద సముద్రం ప్రశాంతంగా ఉండడం చాలా అరుదు. అలలు తీరాన్ని ఢీకొడుతూనే ఉంటాయి. అక్కడే ఫ్లోటింగ్ బ్రిడ్జిని కొనసాగించాలనే ప్రయత్నం కంటే..సురక్షితమైన ప్రాంతంలో నిర్వహించడం ఎంతో మేలు. ఈ ప్రాజెక్టు కారణంగా పర్యాటకులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారు. ఇవీమీ అధికారులకు అర్థం కావడం లేదు.

పుట్ట గొడుగులతో లాభాలు బాగు

- గిరిజన యువకుడి కృషి



మొగ్గ దశలో ఉన్న పుట్ట గొడుగులు

జి.మాడుగుల, మార్చి 2:

ఉద్యోగం కోసం పరుగులు పెట్టకుండా స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నాడు ఓ గిరిజన యువకుడు. తక్కువ పెట్టుబడితో పుట్ట గొడుగుల పెంపకాన్ని చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.

మండలంలోని సింగర్భ పంచాయతీ నిమ్మవీధి గ్రామానికి చెందిన కోడ గోపి డిగ్రీ చదివాడు. ఉద్యోగం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే కన్నా స్వయం ఉపాధి చూసుకోవాలని భావించాడు. పుట్ట గొడుగుల పెంపకం గురించి తెలుసుకున్నాడు. గ్రామంలో తాత్కాలికంగా షెడ్డు ఏర్పాటు చేసుకుని పుట్ట గొడుగుల పెంపకాన్ని ప్రారంభించాడు. రూ.30 వేల పెట్టుబడితో వ్యాపారాన్ని మొదలు పెట్టాడు. ప్రస్తుతం షెడ్డులో 150 బుట్టలు ఉండగా, అందులో నుంచి రోజూ 10 కిలోల వరకు పుట్ట గొడుగులు వస్తున్నాయని గోపి తెలిపాడు. ఖర్చులు పోనూ లాభం బాగానే వస్తుందని అతను చెప్పాడు.

ప్రభుత్వం చేయూత ఇవ్వాలి



ప్రభుత్వం చేయూత అందిస్తే వ్యాపారాన్ని మరింత విస్తరించవచ్చు. పుట్ట గొడుగుల పెంపకం లాభసాటిగా ఉంటుంది. గిరిజన యువత దీనిని ఉపాధిగా ఎంచుకోవచ్చు. ప్రభుత్వ సహకారం ఉంటే వ్యాపారాన్ని అభివృద్ధి చేసి, కొందరికైనా ఉపాధి కల్పిస్తా.

- **కోడ గోపి**, నిమ్మవీధి, సింగర్భ పంచాయతీ

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

పాడేరురూరల్, మార్చి 2: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. విద్యార్థినీ, విద్యార్థులు ఉదయం 8 గంటలకే ఆయా కళాశాలల నుంచి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఏపీఆర్, కేజీబీవీ కళాశాలల అధ్యాపకులు విద్యార్థినులను బస్సులో పరీక్షా కేంద్రాలకు తీసుకువచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీఆర్ గురుకుల కళాశాల, కేజీబీవీ కళాశాలతో పాటు ఐదు ప్రైవేటు కళాశాలల్లో విద్యను అభ్యసించే 736 మంది విద్యార్థినీ, విద్యార్థులు తొలి రోజు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 716 మంది మాత్రమే హాజరయ్యారని, మిగిలిన 20 మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమాదేవి తెలిపారు. పరీక్షా కేంద్రం ఎ- సెంటర్(ఒకేషనల్)లో 421కి గాను 412 మంది హాజరుకాగా, 9 మంది గైర్హాజరు అయ్యారని, బి- సెంటర్(జనరల్)లో 315 మందికి గాను 304 మంది హాజరు కాగా, 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

పకడ్బందీగా ఈవీఎంల పంపిణీ ప్రక్రియ

అరకులోయ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల పంపిణీ ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకులోయ అసెంబ్లీ స్థానానికి కేటాయించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాలును ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ కౌంటర్లు, ఫుడ్ కౌంటర్లు ఎక్కడెక్కడ ఏ విధంగా ఏర్పాటు చేయాలనేది అధికారులకు సూచించారు. డిగ్రీ కళాశాల మైదానంలో పూర్తిగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా పక్కాగా బారికేడ్లు నిర్మించాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది, ఈవీఎంలు తరలించడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, రిసెప్షన్ సెంటర్ ఏవిధంగా ఏర్పాటు చేయాలో ఆయన వివరించారు. కౌంటింగ్ సిబ్బంది, రాజకీయ పార్టీల ఏజెంట్లకు ప్రత్యేకంగా ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, అరకులోయ తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈఈ పి.అనుదీప్, తదితరులు పాల్గొన్నారు.



పాడేరు డిగ్రీ కళాశాలలో ఈవీఎంల పంపిణీపై అధికారులకు సూచనలిస్తున్న అభిషేక్

క్రైం... crime news

నదిలో పడి రిక్షా కార్మికుడి మృతి


మృతుడు గంపల అప్పారావు

పాయకరావుపేట, మార్చి 2: పట్టణంలోని తాండవ వంతెన పైనుంచి నదిలోకి ప్రమాదవశాత్తూ పడి ఒక వ్యక్తి మృతిచెందాడు. శనివారం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన గంపల అప్పారావు(50) రిక్షా కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 28 సంవత్సరాల క్రితం అప్పారావుకు, అతడి భార్యకి మధ్య గొడవలు జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తుని కొండవారిపేటలో ఉన్న తన సోదరుడు గంపల దేవుళ్లు ఇంటిలో అప్పారావు ఉంటున్నాడు. మద్యానికి అలవాటుపడిన అప్పారావు మద్యం సేవించినపుడు తుని, పాయకరావుపేటల మధ్య ఉన్న తాండవ వంతెనపైనా, లేదా తుని రైల్వే గెస్టు హౌస్ వద్ద రిక్షాపెట్టి అందులోనే పడుకునేవాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించిన మైకంలో తాండవ వంతెనపై నుంచి వెళుతూ ప్రమాదవశాత్తూ తాండవ నదిలోకి పడిపోయి మృతిచెంది ఉంటాడని మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్ఐ రామారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

అడ్డరోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

- దగ్గరలోని పాత హైవేపై రక్తపు మరకలు
- ఎవరో చంపి పడేసి ఉంటారనే కోణంలో పోలీసుల దర్యాప్తు
- క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాల సేకరణ


మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం బృందం

ఎస్.రాయవరం, మార్చి 2: మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కనే గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే హైవేపై అడ్డరోడ్డు జంక్షన్ సమీపంలో శనివారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. వెంటనే ఈ సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. సమాచారం అందుకున్న వెంటనే సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు, సిబ్బంది మృతదేహం ఉన్న ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఆ ప్రాంతానికి సమీపంలో పాత జాతీయ రహదారిపై రక్తపు మరకలు ఉండడంతో ఎవరో అతడిని చంపి పడేసి ఉంటారనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలతో మధ్యాహ్నం వరకు ఆధారాలు సేకరించారు. అక్కడికి సమీపంలో ఉన్న సీసీ ఫుటేజ్‌ను కూడా పరిశీలిస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు. అలాగే మృతి చెందిన వ్యక్తి ఎవరన్నది తెలియకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలానికి పాయకరావుపేట, నక్కపల్లి సీఐలు, కోటవురట్ల ఎస్ఐ కూడా చేరుకొని పరిశీలించారు.


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రైలు ప్రమాదంలో గాజువాక వాసి మృతి

ఎలమంచిలి, మార్చి 2 : ఎలమంచిలి ఫ్లైఓవర్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి గాజువాక ప్రాంతానికి చెందిన గజగంటరావు సంతోష్ కుమార్(36)మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మృతుడు సంతోష్ కుమార్ వారం రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రానికి వెల్డింగ్ పనులు చేసేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి, ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారని తెలిపారు. ప్రమాదం గురించి బంధువులకు సమాచారం అందించామని, మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందన్నారు.

డాక్‌యార్డు ఉద్యోగి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 2: స్థానిక భీమునిగుమ్మంకు చెందిన డాక్‌యార్డు ఉద్యోగి గొర్లి దివాకర్ (32) శనివారం మృతి చెందిన సంఘటన పై ఆయన సోదరుడు శ్యామ్ దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. అవివాహితుడైన దివాకర్ డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తూ తన మేనత్త ఇంట్లో ఉంటున్నారు. శుక్రవారం విధులకు వెళ్లి రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఆరు గంటలకు కాఫీ తాగిన అనంతరం బయటకు వెళ్లి వచ్చాడు. ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో నోటి నుంచి నురగలు రావడాన్ని చూసిన మేనకోడలు ఇంట్లో వారికి చెప్పగా హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మానసిక ఆందోళనకు మనస్తాపానికి గురై ఉంటాడని, అనారోగ్యం కారణంగానే చనిపోయి ఉంటాడని భావిస్తూ మృతుడు సోదరుడు శ్యామ్ దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహ్మద్ ఆలీతెలిపారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 2 : మండలంలోని తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన సూరాడ రాజు, సూరాడ మసేనులను 20 క్వార్టర్ మద్యం సీసాలతో శనివారం రాత్రి పట్టుకున్నట్టు పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు


సారా బట్టీ ధ్వంసం చేస్తున్న ఎస్ఐ

బుచ్చెయ్యపేట, మార్చి 2 : కొండపాలెంలో సారా బట్టీపై ఎస్ఐ డి.ఈశ్వరరావు శనివారం సిబ్బందితో దాడి చేశారు. ఇరవై లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఆరు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే, నాటుసారా కాస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

900 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

పాయకరావుపేట రూరల్, మార్చి 2 : మండలంలోని ఈదటం గ్రామ శివారులో నాటు సారా బట్టీపై శనివారం పోలీసులు దాడి చేసి 900 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి సీఐ పి.అప్పలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఈదటం గ్రామ శివార్లలో సారా తయారీపై అందిన పక్కా సమాచారం మేరకు పాయకరావుపేట పోలీసులు దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన నిందితులు పారిపోయారని, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 900 లీటర్ల బెల్లం పులుసును గుర్తించి, ధ్వంసం చేశామని సీఐ అప్పలరాజు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దాడిలో ఎస్ఐ జోగారావు తదితరులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లు

- రికార్డులు తీసి చూస్తే నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధి తెలుస్తుంది
- జగన్ పాలనలో దళితులపై దాడులు అధికం
- మాజీ మంత్రి అయ్యన్న వెల్లడి
- ఎస్సీ కాలనీలో వైసీపీ నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరికలు


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో అయ్యన్నపాత్రుడు, విజయ్

నర్సీపట్నం, మార్చి 2: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు తెరిపిస్తామని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని మూడో వార్డు ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు గుడాల అప్పారావు, లలిత, గెడ్డం రామన్న, ఎంఆర్‌పీఎస్ లోకేశ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆ పార్టీకి చెందినవారు శనివారం ఇక్కడ టీడీపీలో చేరారు. వీరందరికీ అయ్యన్నపాత్రుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అన్న క్యాంటీన్లు పెట్టి రూ.5కే అన్నం పెట్టారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్ దుర్మార్గంగా తీసేశారని విమర్శించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఎదురుగా పెట్టిన అన్న క్యాంటీన్ తీసేస్తే తాను 224 రోజులుగా రూ.2లకే అన్నం పెడుతున్నానని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే గణేశ్ నా వయస్సుకి గౌరవం ఇవ్వకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. నర్సీపట్నానికి తాను ఏం చేశానో రికార్డులు తీసి చూస్తే తెలుస్తుంది ఎమ్మెల్యేనుద్దేశించి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ , ఏరియా ఆస్పత్రి, జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాల, బాలయోగి గురుకుల పాఠశాల, ఏపీఆర్ఎస్, మాకరపాలెంలో అవంతి ఇంజనీరింగ్ కళాశాల టీడీపీ హయాంలో ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పుడు ఏరియా ఆస్పత్రి దిక్కు మాలిపోయిందని, కరెంటు పోతే జనరేటర్‌లోకి ఆయిల్ పోయడానికి డబ్బులు లేవని డాక్టర్లు అంటున్నారని విమర్శించారు. నర్సీపట్నంలో 2300 మందికి చంద్రబాబు టిడ్కో గృహాలు మంజూరు చేస్తే, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో లబ్ధిదారులకు అప్పగించ లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంక్ రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 16 కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారని, వాటిలో నిర్భయ కేసు కూడా ఉందని వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేల మంది దళితులపై దాడులు జరిగాయని, 30 మందిని చంపేశారని ఆరోపించారు. రూ.33వేల కోట్లు సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లించారని, ఎస్సీ, ఎస్సీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఉద్యోగాలు రాని వారికి నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తారని తెలిపారు. ప్రతీ ఇంటికి ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, ఇంట్లో చదువుకుంటున్న పిల్లలకు రూ.15వేలు, ప్రతీ మహిళలకు నెలకు రూ.1500 చొప్పున అందజేస్తారని, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తారని హామీ ఇచ్చారు. రాష్ట్రం కోసం, మన ప్రాంతం కోసం టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, నేతల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంపౌండబుల్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 2: ఈనెల 16వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కంపౌండబుల్ కేసులను ప్రత్యేక ప్రణాళికతో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మోనటరింగ్ సెల్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. రాజీ చేసుకోదగిన కేసుల్లో ఉభయపక్షాల వారిని లోక్‌అదాలత్‌లో ప్రవేశపెట్టడం వల్ల ప్రజలకు సమయం, డబ్బు వృథా కాకుండా చేయగలిగిన వారవుతామన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో అనుసంధానంగా ఉంటూ కేసుల్లో కన్విక్షన్ శాతం పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్ఐఆర్ నుంచి చార్జిషీటు వరకు జరిగే ప్రక్రియ కోర్టు విచారణ దశలో సమన్లు, ఎన్‌బీడబ్ల్యు సంబంధించిన వ్యక్తులకు సర్వే చేసే విధంగా స్థానిక ఎస్‌హెచ్‌వోలకు తెలపాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణమూర్తి, సీఎంఎస్ ఎస్ఐ రామారావు, కోర్టు కానిస్టేబుళ్లు, మోనటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రంపపు పొట్టు ముసుగులో గంజాయి రవాణా

- గుట్టును ఛేదించిన రావికమతం
- ఎనిమిది మంది అరెస్టు
- 110 కిలోల గంజాయి.., రూ.లక్షా మూడు వేల నగదు స్వాధీనం


పట్టుబడిన గంజాయిని చూపుతున్న సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ, సిబ్బంది

రావికమతం, మార్చి 2 : రంపపు పొట్టు ముసుగులో గంజాయిని తరలిస్తున్న ముఠాను రావికమతం పోలీసులు చాకచక్యంగా పట్టుకుని గుట్టు రట్టు చేశారు. ఇందుకు సంబంధించి కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు శనివారం విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలివి. రావికమతంలో స్వీట్ షాపు నడుపుతున్న గంజి సత్తిబాబు మాడుగుల మండలం తిరువాడ గ్రామానికి చెందిన జుత్తాడ రాము ద్వారా స్వీట్లు తయారు చేసే పొయ్యిలోకి ఉపయోగించే రంపపు పొట్టుతో కలిపి గంజాయిని రావికమతం తీసుకు వచ్చి దానిని సత్తిబాబు స్వీట్ షాపులో భద్రపర్చి తమిళనాడు వ్యాపారులకు అమ్ముతున్నట్టు పోలీసులకు స్పష్టమైన సమాచారం అందింది. ఈ మేరకు రావికమతం ఎస్ఐ ధనుంజనాయుడు నిఘా వేశారు. శుక్రవారం రాత్రి వినియోగదారుల వలే మఫ్టీలో స్వీట్లు తయారు చేసే ఇంటిని పోలీసులు చుట్టిముట్టారు. ఎస్ఐ లోపలకు ప్రవేశించే సరికే రంపపు పొట్టు నుంచి గంజాయిని వేరు చేసి రెండు కిలోల చొప్పున ప్యాకింగ్ చేస్తుండగా ఇద్దర్ని పట్టుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకోని వీరి సెల్ ఫోన్ ద్వారా స్ట్రింగ్ అపరేషన్ చేశారు. ఈ గంజాయితో సంబంధం ఉన్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. స్వీట్ షాపు యజమాని సత్తిబాబుతో పాటు మాడుగుల మండలం సత్యవరానికి చెందిన వాకాడ ఏసుకుమార్, సాగరం గ్రామానికి చెందిన వంజివంజల నాగరాజు, ఎలమంచిలి మండం గొల్లపాలేనికి చెందిన కోన అప్పలరాజు, తమిళ నాయుడుకు చెందిన సభాపతి గణేశ్, కోదండరాం రూపేష్‌లు పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి కూలీలతో కాలి నడకమార్గం ద్వారా దిగువకు తిరువాడ గ్రామానికి గంజాయిని చేర్చుతున్నట్టు సీఐ వివరించారు. ఇక్కడి నుంచి రంపపు పొట్టు మధ్యలో పెట్టి సరఫరా చేస్తున్నారన్నారు. రావికమతం స్వీట్ షాపులో రెండు కిలోలు చొప్పున ప్యాకింగ్ చేస్తుండగా నిందితులను పట్టుకుని అరెస్టు చేసినట్టు సీఐ చెప్పారు. వీరి నుంచి రూ. లక్షా మూడు వేల నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ ధనుజయనాయుడు పాల్గొన్నారు.

కొణతాలను కలిసిన గెడ్డం బుజ్జి


అనకాపల్లిలో కొణతాలతో మాట్లాడుతున్న బుజ్జి, జనసేన నాయకులు

పాయకరావుపేట రూరల్, మార్చి 2: అనకాపల్లి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను శనివారం పాయకరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి మర్యాదపూర్వకంగా అనకాపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, సార్వత్రిక ఎన్నికల గురించి చర్చించినట్టు బుజ్జి తెలిపారు. జనసేన టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టో, వైసీపీ అరాచక పాలనను ప్రజలలోకి తీసుకెళ్లాలని కొణతాల సూచించారన్నారు. గెడ్డం బుజ్జితోపాటు జనసేన నాయకులు యగదాసు నానాజీ, ఆచంట దొర, వెలగా సుధాకర్, పప్పల శివ, సింగపల్లి శ్రీను, జగ్గన్నదొర, పల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రచారకుడు కామేశ్ మృతి


పిక్కి కామేశ్వరరావు (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, మార్చి 2: మండలంలోని రాజయ్యపేటలో గ్రామ సర్పంచ్ పిక్కి అప్పలనర్స తనయుడు, హిందూ ధర్మ ప్రచారకుడు పిక్కి కామేశ్వరరావు (కామేశ్) తీవ్ర అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించారు. సుదీర్ఘకాలం పాటు ఎస్ఎస్ఎఫ్ మండల ధర్మ ప్రచారకుడిగా ఎంతో సమర్థవంతంగా పనిచేశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన కామేశ్వరరావు విశాఖ, హైదరాబాద్, అగనంపూడి తదితర ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి కన్నుమూశారు. ఆదివారం ఉదయం రాజయ్యపేట గ్రామంలో కామేశ్ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు చెప్పారు. విషయం తెలిసిన వెంటనే తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు కోసూరి శ్రీను, తదితరులు తీవ్ర సంతాపం తెలియజేశారు.

ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు పరీక్షలు రాయాలి : డీఈవో


విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

అచ్యుతాపురం, మార్చి 2: టెన్త్ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటలక్ష్మమ్మ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం అవుతున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేశారు. విద్యార్థులు మంచి ఆహారం తీసుకుంటూ ఎటువంటి భయం, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. మరింత ఉత్సాహంగా పనిచేసి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడానికి కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ వై.వెంకటేశ్వరరావు, హెచ్ఎం ఎం.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కన్ను ముచ్చెలతో చెరకు అధిక దిగుబడులు

- ఏడీఆర్ డాక్టర్ జగన్నాథరావు


రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 2: ఒంటి కన్ను ముచ్చులు వాడడం వలన చెరకు అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. చెరకు సాగులో సాంకేతికతపై ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు శనివారం ఆర్ఏఆర్ఎస్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. 'ఆత్మ' ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి గ్రామీణ యువ రైతులకు ఆధునిక సాంకేతికతపై శిక్షణనిచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కేవీ రమణమూర్తి సేంద్రియ విధానంలో చెరకు సాగుపై శిక్షణనిచ్చారు. బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతులు తమ ఆదాయాలను పెంచుకోవచ్చని ప్రధాన ఇంజనీరింగ్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి వివరించారు. శిక్షణ పొందిన రైతులకు ఏడీఆర్, ఆశాదేవి, రమణమూర్తి సర్టిఫికెట్లు అందజేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

నర్సీపట్నం, మార్చి 2: కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని పెదబొడ్డేపల్లి ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 5 ,6, 7, 8 తరగతులలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వీవీ రాజేంద్ర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా వివిధ కేటగిరీలలో నిర్ధేశించిన రిజర్వేషన్ ప్రక్రియ పాటిస్తూ ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని వివరించారు. దరఖాస్తుకు ఈ నెలాఖరు వరకు గడవు ఉందని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా కోరారు.

అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు బదిలీ



అనకాపల్లి టౌన్, మార్చి 2 : అనకాపల్లి డీఎస్పీ వి. సుబ్బరాజుకు బదిలీ అయ్యింది. గతేడాది ఏప్రిల్ 29న ఈయన అనకాపల్లి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈయన్ని విజయవాడ ఏసీబీకి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో విశాఖ నగర పరిధిలోని ఇంటిలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్. అప్పలరాజు నియమితులయ్యారు. మరికొద్ది రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

గుణుపూర్ ప్రత్యేక పాసింజర్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, మార్చి 2: వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ, పర్లాకిమిడి స్టేషన్ల మధ్య పవర్ బ్లాక్ పనుల నేపథ్యంలో విశాఖ, గుణుపూర్ మధ్య నడుస్తున్న 08522, 08521 నంబర్లు గల ప్రత్యేక పాసింజర్ రైళ్లను ఈనెల 3, 6, 10, 13, 17, 20, 24, 27, 31వ తేదీల్లో తాత్కాలిక రద్దు చేశామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రయాణికులు ఈ విషయం గుర్తించాలని కోరారు.

7న ప్రధానితో 'ప్రసాద్' పనులకు శంకుస్థాపన

సింహాచలం, మార్చి 2 : సింహగిరిపై కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం నిధులతో చేపట్టనున్న పనులకు ఈనెల 7న ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్టు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. ఆ కార్యక్రమానికి కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా హాజరు కానున్నట్టు చెప్పారు. కేంద్రం సింహాచల దేవస్థానానికి రూ.54.4 కోట్లు, అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానానికి రూ.20 కోట్లు ప్రసాద్ పథకం కింద మంజూరు చేసిందన్నారు.



బూత్, క్లస్టర్ కమిటీల సభ్యులకు పార్టీ సామగ్రి అందిస్తున్న గిడ్డి ఈశ్వరి

సూపర్-6 పథకాలు ప్రతీ ఇంటికి తెలియాలి

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, మార్చి 2: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్-6 పథకాల గురించి శంఖారావం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి తెలియజేయాలని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కోరారు. కుమ్మరిపుట్టులో పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కుటుంబాన్ని కలిసి సూపర్-6 పథకాలను వివరించాలని చెప్పారు. ఈ నెల 8వ తేదీన పాడేరులో జరిగే ప్రజాగళం సభను విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో విసుగు చెందిన ప్రజలు, వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చాక టీడీపీ/జనసేన ప్రభుత్వం అమలు చేసే పథకాలను వివరించాలన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరచి, వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి చంద్రబాబును సీఎంను చేసేందుకు అందరూ కంకణం కట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్, పార్టీ మండలాల అధ్యక్షులు పూర్ణచందరరావు, కొండలరావు, రమేష్ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వెబ్‌సైట్‌లో వాల్మీకి తెగ పేరు చేర్చండి

» జిల్లా కలెక్టర్‌కు టీడీపీ నాయకుల వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ నాయకులు

పాడేరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వెబ్‌సైట్‌లో తొలగించిన గిరిజన వాల్మీకి తెగ పేరును చేర్చాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ విజయసునీతకు శనివారం వినతిపత్రం సమర్పించారు. కేవలం గిరిజన ఉప కులాల మధ్య చిచ్చు పెట్టాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా చేస్తున్నదని భావిస్తున్నామన్నారు. గిరిజనులను ఇబ్బంది పెట్టే ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి న్యాయం చేసేలా వాల్మీకి తెగ పేరును ప్రభుత్వ వెబ్ సైట్‌లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాంగి పాండురంగస్వామి, పి.రామలింగం, ఆర్.త్రినాథ్, జె.తిరుపతిరావు, ఎ.రాజారావు పాల్గొన్నారు.

వాల్మీకి తెగపై కక్షగట్టిన జగన్

» రాజకీయ లబ్ధి కోసమే వెబ్‌సైట్ నుంచి తొలగింపు

» గిరిజన సంఘం జిల్లా ప్రతినిధులు ధర్మన్నపడాల్, సన్నిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

పెదబయలు, మార్చి 2: వాల్మీకి తెగపై సీఎం జగన్ కక్షగట్టారని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్, పూర్వ అధ్యక్షుడు బొండా సన్నిబాబు ఆరోపించారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం భవనంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 33 గిరిజన ఉప తెగలలో ఒకటైన వాల్మీకి తెగను సచివాలయ లాగిన్ నుంచి తొలగించడం అన్యాయమన్నారు. రాజకీయ స్వలాభం కోసమే ఇంతటి దారుణానికి ఒడిగట్టారన్నారు. రాజ్యాంగం మీద కనీసం అవగాహన లేని వైసీపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ధిక్కరణకు పాల్పడడం సరికాదని వాపోయారు. ఈ నేరానికి పాల్పడిన కారకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెగల ఐక్యతను కాపాడుతూ ఇప్పటివరకూ అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇస్తుంటే, జగన్ ప్రభుత్వం మాత్రం తెగల మధ్య విభజన చేసి శునకానందం పొందడం విడ్డూరంగా ఉందని వారు వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా గిరిజన ఎంపీ, ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే 33 గిరిజన కులాలతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు టి.కౌసల్య, మండల అధ్యక్షుడు బి.గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన లేని సచివాలయ ఉద్యోగులు

ధారకొండ-1లో 10.30 గంటలు దాటినా తెరచుకోని కార్యాలయం



తెరచుకోని ధారకొండ గ్రామ సచివాలయం-1

సీలేరు, మార్చి 2: గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ గ్రామ సచివాలయం-1 ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేశామని వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పదేపదే చేస్తున్న ప్రకటనలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. శనివారం ధారకొండ గ్రామ సచివాలయం-1 కార్యాలయం ఉదయం 10.30 గంటలు దాటినా తెరచుకోలేదు. దీంతో కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర సేవల కోసం సచివాలయానికి వచ్చిన ఆదివాసీలు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కొంత మంది ఆదివాసీలు అసహనం వ్యక్తం చేస్తూ గృహాలకు వెళ్లిపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ధారకొండ గ్రామ సచివాలయం-1 ఉద్యోగులు సమయానికి సక్రమంగా సచివాలయం తెరిచేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులు సమయపాలన పాటించేలా చూడాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సచివాలయ భవనాలు ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కొయ్యూరు, మార్చి 2: మండలంలోని రావణాపల్లి, మంప గ్రామ సచివాలయ నూతన భవనాలు, రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆమె మాట్లాడుతూ రూపాయి అవినీతి లేకుండా ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జడ్‌పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మునిలినాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, సర్పంచులు కాకర లక్ష్మి, ఇంగువ రామన్నపడాల్, రాజకుమారి, ఎంపీడీవో సీతయ్యనాయుడు, ఏవో ఉమాదేవి పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు చేసే వైసీపీకి ఓటెయ్యొద్దు

» అభివృద్ధి రాజకీయాలు చేసే టీడీపీని గెలిపించాలి

» టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర



పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న దొన్నుదొర

అరకులోయ, మార్చి 2: రాష్ట్రంలో హత్యా రాజకీయాలకు, అభివృద్ధి రాజకీయాలకు మధ్య యుద్ధం జరుగుతుందని, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. శనివారం తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే వివేకానందరెడ్డిని జగన్ ముఠా హతమార్చిందని ఆరోపించారు. హత్యా రాజకీయాలు చేసే వైసీపీకి ఓటు వేయకూడదని, అభివృద్ధి రాజకీయాలు చేసే టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. గొడ్డలి పోటుతోనే బాబాయ్ చనిపోయారని జగన్‌రెడ్డి అంత కచ్చితంగా ఎలా చెప్పగలిగారని, దీనిపైనా సీబీఐ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో పురోగతి ఎందుకు సాధించలేకపోయారని, దీనికి సీఎం జగన్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తన తండ్రిని హతమార్చిన వారిని శిక్షించాలంటూ సునీతారెడ్డి పోరాడుతుంటే, అందుకు సహకారం అందించాల్సిన సీఎం జగన్ మరో తమ్ముడైనా అవినాష్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేయకుండా అడుగడుగునా అడ్డుపడ్డారన్నారు. హైప్రొఫైల్ కేసులో కూడా ఇంత జాప్యానికి జగన్‌రెడ్డే కారణమని స్వయాన అతని సోదరి సునీతారెడ్డి ఆరోపించారని పేర్కొన్నారు. ఇటువంటి హత్యా రాజకీయాలు చేసే జగన్‌రెడ్డి పార్టీ వైసీపీకి ఎవరూ ఓటెయ్యవద్దని, అభివృద్ధి రాజకీయాలను చేసే టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో పెదలబుడు సర్పంచ్ పి.దాసుబాబు, చినలబుడు సర్పంచ్ బురిడి ఉపేంద్ర, ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.నిర్మల, ఎంపీటీసీ మాజీ సభ్యులు దొన్ను, వెంకట్రావు, మాజీ సర్పంచ్ జగన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే శరణ్యం

మాతృ భాష విద్యా వలంటీర్ల సంఘం జిల్లా కోశాధికారి చంద్రయ్య



నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఆదివాసీ మాతృ భాష విద్యా వలంటీర్లు

పాడేరు రూరల్, మార్చి 2: గిరిజన ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో ప్రాథమిక విద్యను మాతృ భాషలో బోధిస్తూ విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషి చేస్తున్న ఆదివాసీ మాతృ భాష విద్యా వలంటీర్ల సమస్యలను పరిష్కరించకుంటే ప్రభుత్వంపై పోరాటమే శరణ్యమని సంఘం జిల్లా కోశాధికారి వి.చంద్రయ్య స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ ఎదురుగా వలంటీర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 676 మంది మాతృ భాష వలంటీర్లు 2019 నుంచి విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏటా పోరాటాలు చేసే విధుల్లో చేరడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీ వరకు పని చేయించుకున్న అధికారులు మార్చి, ఏప్రిల్ నెలలకు కంటిన్యూ చేయనివ్వకుండా బడ్జెట్ లేదంటూ రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. తమ సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్ని వినతులు అందించినా స్పందించకపోవడం విచారకమని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజన విద్యపై చిత్తశుద్ధి లేనందునే తమ సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మార్చి, ఏప్రిల్ నెలల్లో విధుల్లో కొనసాగించాలని, ప్రతీ విద్యా సంవత్సరంలో సకాలంలో రెన్యువల్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె.కొండయ్య, కె.గణేష్, పి.వెంకట్, పి.దేవి, వి.రాధ, 11 మండలాల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి

» మండల కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు, మానవహారాలు



ముంచంగిపుట్టు ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు, మార్చి 2: ఐదేళ్ల లోపు చిన్నారులకు తల్లిదండ్రులు పల్స్‌పోలియో చుక్కల మందును తప్పనిసరిగా వేయించాలని కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.రమేష్ చెప్పారు. ఆదివారం జరగనున్న చుక్కల మందు కార్యక్రమంపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏజెన్సీలోని పలు మండలాల్లో ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. ముంచంగిపుట్టు వారపు సంతలో జరిగిన కార్యక్రమంలో పిల్లలకు చుక్కల మందు ఆవశ్యకతను డాక్టర్ రమేష్ వివరించారు. పీహెచ్‌సీ పరిధిలోని 62 పల్స్‌పోలియో చుక్కల మందు పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందరూ తమ ఐదేళ్ల లోపు పిల్లలను కేంద్రాల వద్దకు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శిరీష, ఆరోగ్య విస్తరణ అధికారి కె.రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు బి.కృష్ణవేణి, సిహెచ్.వేదవతి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కిశోర్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలులో...

పెదబయలు: మండల వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెదబయలు వైద్యాధికారి నిఖిల్ పిలుపునిచ్చారు. పెదబయలు పుర వీధులలో వైద్య సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులతో పల్స్‌పోలియోపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెదబయలు ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు చేతబట్టుకొని నిండు జీవితానికి రెండు చుక్కలు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని ఐదేళ్లలోపు చిన్నారులు తప్పకుండా పోలియో చుక్కలను వేయించేలా తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని కోరారు. మండల వ్యాప్తంగా ప్రతీ చిన్నారికి చుక్కల మందు పక్కాగా అందేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటరావు, సింహచలం, మూర్తి పాల్గొన్నారు.



జీకే వీధిలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి కోమలి, వైద్య సిబ్బంది

కొయ్యూరులో...

కొయ్యూరు: నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదంతో పోలియో నివారణకు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్ఞ కోరారు. మండల కేంద్రంలో శనివారం పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రాజేంద్రపాలెం పీహెచ్‌సీ పరిధిలో 2825 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఇందుకుగానూ 70 బూత్‌లతో పాటు రెండు మొబైల్ బూత్‌లు, 300 సిబ్బందిని ఏర్పాటు చేశామని చెప్పారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు నిర్వహిస్తున్న పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కల మందు వేయించాలని పెదవలస పీహెచ్‌సీ వైద్యాధికారి కోమలి కోరారు. పెదవలస పంచాయతీ కేంద్రంలో శనివారం పల్స్ పోలియో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ చిన్నారులు అంగవైకల్యానికి గురికాకుండా చుక్కల మందు వేయించాలన్నారు. పాఠశాలలు, పీహెచ్‌సీ, ఆరోగ్య ఉప కేంద్రాలు, బస్‌స్టాండ్ వద్ద పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులకు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈవో బాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక ఆదాయం

పాడేరు రూరల్, మార్చి 2: చిరుధాన్యాలు, పసుపు విలువ ఆధారిత ఉత్పత్తులతో గిరిజన రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని నాబార్డు డీడీఎం సంతోష్ తెలిపారు. వంజంగి పంచాయతీ కొత్తవలస, బొర్రమామిడి గ్రామాల్లో స్మైల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో శనివారం గిరిజన మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు, పసుపు ప్రాసెస్ చేసుకోవడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. విలువ హెచ్చింపు చేయడం వల్ల క్వాలిటీ, గ్రేడింగ్ పెరిగి మార్కెట్‌లో అదనపు ఆదాయాన్ని సంపాదించవచ్చని వివరించారు. బీసీటీ, కేవీకే నుంచి వచ్చిన శాస్త్రవేత్త దివ్యసుధ మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యత, సంస్థ రైతుల జీవనోపాధిని పెంపొందించేందుకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను వివరించారు. ఒక్కొక్క గ్రామం నుంచి 30 మంది మహిళలకు ప్రోసెసింగ్ చేసిన ఉత్పత్తులు మార్కెటింగ్ చేసేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామని సంస్థ డైరెక్టర్ మురళి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి అవసరం

» వైసీపీ అరకు నియోజకవర్గం పరిశీలకురాలు శోభ హైమావతి

ముంచంగిపుట్టు, మార్చి 2: వైసీపీ బలోపేతానికి సమిష్టి కృషి ఎంతో అవసరమని ఆ పార్టీ అరకు నియోజకవర్గం పరిశీలకురాలు శోభ హైమావతి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఇప్పటి నుంచే కార్యకర్తలు, నాయకులు శ్రమించాలని సూచించారు. గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

పెదబయలు, మార్చి 2: ప్రజలు నాటుసారాకు దూరంగా ఉండాలని ఎస్ఐ మనోజ్‌కుమార్, పాడేరు ఎక్సైజ్ ఎస్ఐ శేఖరం చెప్పారు. రెండు శాఖల పోలీసు సిబ్బందితో శనివారం లక్ష్మీపేట నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల జోలికి పోవద్దు చెప్పారు. ఆరోగ్యమే ముద్దు అని నినాదాలు చేశారు. నిషేధిత నాటుసారా, గంజాయి వల్ల జీవితాలు దుర్భరం అవుతున్నాయన్నారు. అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా నేరమని, దాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మద్యం, సారాయి, గంజాయి, గుట్కా ఇతర మత్తు పదార్థాలను అరికట్టడానికి ఎవరైనా 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంచబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌జీఎల్ దస్తగిరి, సర్పంచ్ అశోక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాచపల్లి సంఘటనపై డీఎస్పీ విచారణ

» నిందితుడ్ని అరెస్టు చేసి, అట్రాసిటీ కేసు నమోదు

» పెద్ద కుమార్తె, భార్య సోదరి నుంచి డీఎస్పీ వివరాల సేకరణ

» కాలిన గాయాలతో ఉన్న చిన్నకూతురు పరిస్థితి విషమం

» చికిత్స ద్వారా కోలుకుంటున్న మిగిలిన ఇద్దరు



రాచపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను విచారిస్తున్న డీఎస్పీ

మాకవరపాలెం, మార్చి 2: మండలంలోని రాచపల్లి గ్రామంలో ఓ భర్త దారుణానికి పాల్పడిన ఘటనపై నర్సీపట్నం డీఎస్పీ మోహన్ శనివారం విచారణ చేపట్టారు. రాచపల్లిలో నివాసం ఉంటున్న తుంగళ్ల రమణ తన భార్య విజయ్‌తో గొడవపడడం, కుటుంబ సభ్యులైన భార్య, కుమార్తె శ్రీకావ్యతో పాటు అత్త కృష్ణమ్మ ఇంట్లో నిద్రస్తున్న సమయంలో గురువారం రాత్రి పదకొండు గంటల సమయంలో పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. కాలిన గాయాలతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వీరు ప్రస్తుతం చికిత్సలు పొందుతున్నారు. ఈ ముగ్గురిలో రమణ కుమార్తె పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెపుతున్నారు. ఆమె పొట్టపైన, ఛాతిపైన కాలిన గాయాలు ఎక్కువగా ఉండడంతో ఆసుపత్రిలో వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో శ్రీకావ్యకు పల్స్‌రేటు పడిపోతుందని వైద్యాధికారులు తెలపడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పోలీసుల అదుపులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. అతడిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణను డీఎస్పీ చేపట్టారు. ఘటన జరిగే సమయంలో ఆ పక్క గదిలో పడుకున్న రమణ పెద్ద కుమార్తెతో పాటు అతని భార్య విజయ్ సోదరి నుంచి పలు వివరాలు సేకరించారు. ఈ విచారణలో సీఐ హరి, ఎస్ఐ రామకృష్ణారావు, వీఆర్‌వోలు సింహాద్రి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జిల్లా కలెక్టర్‌ను కలిసిన రిటైర్డ్ ఐఏఎస్ బాబూరావునాయుడు



కలెక్టర్‌కు పుస్తకాలు అందిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ బాబూరావునాయుడు

పాడేరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ విజయ సునీతను స్థానిక రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ తమర్బ బాబూరావు నాయుడు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శాలువా కప్పి సత్కరించారు. అలాగే తను రాసిన పలు పుస్తకాలను బహూకరించి, ఐఏఎస్ అధికారిగా తన అనుభవాలను పంచుకున్నారు. గిరిజన ప్రాంతానికి చక్కని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, మరో నేత గంగన్నపడాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగెడ్డ గిరిజనులకు రేషన్ పంపిణీ

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

గూడెంకొత్తవీధి, మార్చి 2: దేవరాపల్లి పంచాయతీ ఎర్రగెడ్డ గిరిజనులకు ఎండీయూ ఆపరేటర్ రెండు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేశారు. 'ఎర్రగెడ్డ ఆదివాసీలకు రెండు నెలలుగా అందని రేషన్' శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎంపీపీ బోయిన కుమారి జీసీసీ మేనేజర్ వెంకటరమణ, ఉప తహసీల్దార్ కుమారస్వామితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రాథమిక విచారణలో రేషన్ సరకులు జీసీసీ గోదాము నుంచి ఎండీయూ ఆపరేటర్‌కు సరఫరా చేసినట్టు రుజువైందన్నారు. దీంతో ఎండీయూ ఆపరేటర్‌ను ప్రశ్నించగా వాహనం మరమ్మతులకు గురికావడంతో సరకులు సరఫరా చేయలేదని సమాధానం ఇచ్చాడన్నారు. రేషన్ పంపిణీలో జాప్యం చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. కాగా ఎంపీపీ ఆదేశాలతో ఎండీయూ ఆపరేటర్ సాయంత్రం ఎర్రగెడ్డ గిరిజనులకు రేషన్ బియ్యం పంపిణీ చేశాడు.

తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి బదిలీ



చింతపల్లి, ఫిబ్రవరి 2: తహసీల్దార్ సిహెచ్.రాధాకృష్ణమూర్తిని రెవెన్యూ ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి చింతపల్లి వచ్చిన ఆయన నెల రోజులుగా ఇక్కడ విధులు నిర్వహించారు. పార్వతిపురం మన్యం జిల్లా అరకు పార్లమెంట్ పరిధిలో ఉండడంతో స్థానికుడని బదిలీ చేసి విజయవాడ సీసీఎల్ వద్ద రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో అల్లూరి జిల్లా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ రామకృష్ణను నియమించారు. ఈ మేరకు శనివారం ఆయన రిలీవ్ అయ్యారు.

ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 2: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పోతంగి పంచాయతీలోని లబ్ధిదారులకు శనివారం ఇళ్ల పట్టా లను పంపిణీ చేశారు. ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు సిహెచ్.జానకమ్మ, సర్పంచ్ వి.వెంకటరావు పట్టాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని, ఇందులో భాగంగానే ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి గృహాలు మంజూరు చేస్తున్నదని చెప్పారు. మండల వ్యాప్తంగా మొదటి విడతగా 374 ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆనంద్, పి.లలిత, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు బి.సింహాచలం, సిహెచ్.కృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.

అపరిచితులతో తస్మాత్ జాగ్రత్త

డుంబ్రిగుడ, మార్చి 2: విద్యార్థులు బయటకు వెళ్లినప్పుడు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు క్రిష్ణకుమారి సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థునులు, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ పరిచయం లేని వ్యక్తులు వచ్చి మాట్లాడితే దూరంగా ఉండాలన్నారు. బయట వ్యక్తులు తినుబండారాలు ఇచ్చినా తీసుకోకూడదని, వాటిని తినకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో పక్కాగా నిఘా

జి.మాడుగుల, మార్చి 2: ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో పక్కాగా నిఘా ఏర్పాటు చేశామని సీఐ రమేశ్ చెప్పారు. ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. 144 సెక్షన్ విధించిన నేపథ్యంలో ప్రతీ విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించినట్టు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూసుకోవాలని పోలీసు సిబ్బందికి సీఐ ఆదేశించారు.

మావోయిస్టులకు సహకరించొద్దు

చింతపల్లి, మార్చి 2: ఆదివాసీలు మావోయిస్టులకు సహకరించకూడదని సీఐ కె.రమేశ్ సూచించారు. ఏవోబీ సరిహద్దు బలపం పంచాయతీ చెరువూరు గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడుతూ సంఘ వ్యతిరేక శక్తుల జోలికి వెళ్లరాదన్నారు. గంజాయి స్మగ్లర్లు డబ్బులు, మద్యం ఆశ చూపించి సాగు, రవాణాకు ప్రోత్సహిస్తారని, వారి మాయమాటలు నమ్మి విలువైన జీవితాలను నాశనం చేసుకోకూడదని ఆయన సూచించారు. సార్వత్రిక ఎన్నికలకు ఆదివాసీలు సహకరించాలని కోరారు. ఎటువంటి అసౌకర్యం కలిగినా పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

కొమ్మిక పంచాయతీలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణ

కొయ్యూరు, మార్చి 2: కొమ్మిక పంచాయతీ పరిధిలోని బొర్రంపేటతో పాటు మరో రెండు గ్రామాల్లో ఏపీ ఈపీడీసీఎల్ లైన్‌మన్లు విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు. శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా అయ్యే వైర్లు తెగిపోయాయి. దీంతో సరఫరా నిలిచిపోయిందన్న విషయం తెలుసుకున్న లైన్‌మన్లు గిరి, పెద్దబ్బాయి శనివారం ఉదయం హుటాహుటిన ఆయా గ్రామాలకు వెళ్లి విద్యుత్ వైర్లు సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు. వైర్లు తెగిపోయే సమయంలో ఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. సకాలంలో స్పందించిన లైన్‌మన్లకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.